# ఘంటాపథము

మద్రాసు
10-5-92

రాజమణికి—

ఈమధ్య మావారు కాంప్‌లకు ఎక్కువగా వెళ్తున్నారు. దాంతో నాకు టైమ్ బాగా దొరుకుతోంది. ఈ నెలలో నాల్గు నవలలు, పన్నెండు కథలు రాశాను. అన్ని మాగజైన్లలోనూ నా రావలసిన నవలలు, కథలు వున్నాయి. అందుకని ఇప్పుడు మళ్ళీ పంపడం అనవసరం. డిమాండ్ తగ్గుతుంది! అందుకనే వాటన్నింటినీ లాకర్‌లో పెట్టేశాను. అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు కదా? నీ వ్యాసాంగం ఎలా వుంది.

నీ
కన్యాకుమారి.

హైద్రాబాద్
12-5-92

కన్యాకుమారికి—

నీ వుత్తరం అంది, నీ అభివృద్ధికి చాలా సంతోషించాను. ఈమధ్య నాకు రాసుకోవడానికి అసలు టైమ్ దొరకడంలేదు. కానీ గాప్ వస్తే బాగుండదు కదా? అందుకని నాకో మూడు నవల్లు, నాల్గు కథలు అప్పుగా

ఇవ్వు - నా పేరుతో పంపుకుంటాను. మరో అయిదారు నెలలు పోయిన తర్వాత నేను నాల్గు నవల్లు, ఆరు కథలు పంపుతాను.

నీ

రాజమణి.

మద్రాసు

15-5-92

రాజమణీ—

నువ్వు కోరినట్లే మూడు నవల్లు, నాల్గు కథలు పంపుతున్నాను. ఆరునెలలకే పంపు, ఫర్వాలేదు. అవసరంలో వున్నప్పుడు స్నేహితురాళ్ళం ఒకళ్ళనొకళ్లు ఇలా ఆదుకోకపోతే ఎలా? రేపు నాకే ఇలాంటి అవసరం రావచ్చు. మనమధ్య మొహమాటం వుండకూడదని నేను ఘంటాపథంగా చెప్తున్నాను. అర్థమైందా?

నీ

కన్యాకుమారి.

(ఆంధ్రపత్రిక)